# నిత్య గాయాల నది

రవీందర్ బెజ్జారపు

**సాయంకాలమయింది. చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆకాశపు కాషాయ వస్త్రం మాసిపోతోంది. నింగి బ్లాటింగ్ పేపర్‌పైన జరజరా పాకుతూ వస్తున్న నల్లటి సిరాలా ఉంది చీకటి.**

**ఏ రిక్రియేషనులేని కిక్కిరిసిన చిన్న పట్టణాల్లో రైల్వేస్టేషనే గొప్ప రిలాక్సింగ్ పాయింట్! చాలా సాయంకాలాలు చీకటి పడ్డాక మా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఒంటరి సిమెంట్ బెంచీపై కూర్చుంటాను. అల్లసాని పెద్దన వర్ణించిన అందమైన సాయంత్రాల్ని ఆస్వాదించేది ఇక్కడే. ఏకాంతంలో గొప్ప సమూహాన్ని, జాతరలాంటి జనం మధ్య ఏకాంతాన్ని అనుభూతి చెందేది ఇక్కడే!**

కాని గత కొద్దిరోజులుగా నా సమస్త ఆలోచనల్ని ఆక్రమించుకుంటోందామె. దాదాపు ప్రతిరోజు వస్తోంది. నాలాగే ఒంటరిగా, దూరంగా కూర్చుంటుంది.

ఆమె పట్ల పట్టరాని కుతూహలం, ఆకర్షణ ఏర్పడ్డాయి నాలో. రోజుకొక రకంగా కనిపిస్తుంది. ఒక్కోసారి ఆమె వేల సంవత్సరాల అనుభవంతో పండిన వృద్ధురాలిలాగా అనిపిస్తుంది. మరోసారి ముసలితనపు జాడలే లేని నూత్న జవ్వనిలాగా కనిపిస్తుంది. అసలు ఎవరీమె?

ఆమెలో ఎన్ని ద్వంద్వాలున్నా, వైరుధ్యాలున్నా ఆమెలో గొప్ప ఆకర్షణ ఉంది. అది మాత్రం నిజం. ఎన్నో ఏళ్ళ పరిచయం, ఆత్మీయత మామధ్య ఉన్నట్లు అనుభూతి చెందుతాను. ఆమెను చూసినప్పుడల్లా తొలకరి స్పర్శకు మురిసిన మట్టి తొలి పరిమళం నన్ను అలుముకుంటుంది.

ఆసక్తిని చంపుకోలేక, ఒకరోజు ఆమె కూర్చున్న చోటుకువెళ్ళాను. నా ఉనికి గమనించి తల పైకెత్తి ఏమిటన్నట్లు చూసింది.

"మీరెవరో తెలుసుకోవచ్చా?" అంటూ వినయంగా అడిగాను.

"నేనా...?" అంటూ నవ్వింది. అంతలోనే ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది.

"నువ్వు నన్ను పోల్చుకోలేవు. నేను నిత్యం కుబుసం విడిచే మహాసర్పాన్ని. నేను అంటార్కిటికా ఖండాన్ని కాదు. ఆరుతువుల అందమైన భూమిని. నడినెత్తిన సూరీడున్న నిత్య మధ్యాహ్నాన్ని!" అంటూ దాదాపు అరుస్తున్నట్లు చెప్పింది.

ఆమె కంఠంలోని తీవ్రతకు వణికిపోయాను. తిరిగి తన వాక్ప్రవాహాన్ని ఇలా కొనసాగించింది.

"...పదితలల మనిషిన్నేను. రావణున్ని కాదు. రావణుడు నా ముఖాల్లో ఒక ముఖం మాత్రమే. అడవులకు నెత్తురు పులిమిన సమ్మక్క సారలమ్మను. చారెడు భూమికోసం పోరు సలిపి గెలిచిన చాకలి అయిలమ్మను. గ్రామీణ దేవతల్ని తల కెత్తుకున్న కంచె ఐలయ్యను. సాంస్కృతిక శిలాజాల్లోంచి దేవుళ్ళను వడగట్టిన కోశాంబిని. అలాగనీ ఎథీస్ట్‌ను కాను. వేదాల్ని ఆరాధించే దాశరథి రంగాచార్యను. జోడేఘాట్‌లో నిద్రిస్తున్న కొమురం భీమును. తెగిన అవయవాల్ని తిరిగి అతికించుకున్న శంబూకున్ని. పెదబొంకూరులో బయటపడిన కుండపెంకుని. మరీ నన్ను రాతియుగం మనిషిననుకునేవు- నేను... చిప్స్ స్పందనల కంప్యూటర్‌ని... అయితే మిత్రమా, నా ఆధార ముఖం మాత్రం నాకే తెలియదు. అది వట్టి బ్లాంక్ ముఖం. అలాగనీ ప్రతి దృశ్యాన్నీ ప్రతిబింబించే ప్లెయిన్ అద్దం కాదు. అది వట్టి బ్లాంక్... అంతే!" ఆయాసపడుతూ ఆగిందామె.

ఆమె మెటఫర్‌లకు కొట్టుకుపోతూ అస్తిత్వాన్ని మరిచిపోయి వింటున్న నాకు తెరిపి దొరికినట్లయింది.

ఆమెవైపు పరీక్షగా చూశాను. పదితలలు లేవు! చిన్న కళ్ళు, నల్లటి ముఖం... జిమ్‌లలో కాకుండా కాయకష్టంతో గట్టిపడ్డ పొందికైన శరీరం... అంతకుమించి చెప్పుకోదగిన విశేషమేమి లేదు. కాని ఆ చిన్న కళ్ళలో మహాస్వప్నాలున్నట్లనిపించాయి.

"అది సరేగానీ, నీ సంగతేంటి?" తిరిగి ప్రశ్నించిందామె.

నవ్వొచ్చింది.

"నాలో అంతమంది లేరు. నా పేరు రవి. నాలో నేను మాత్రమే



ఉన్నాను" అంటూ నవ్వాను.

నా నవ్వును చూసి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిందామె.

"ఛీ... ఒక్క నువ్వేనా? ఏకవచనం గాళ్ళంటే అసహ్యం నాకు" అందామె ఛీత్కారంగా.

నవ్వు నా ముఖం నుండి ఆవిరైపోయింది. ఆమె దురుసు మాటలకు నొచ్చుకున్నాను. కాని ఆమె మాటల్లో ఏదో అవ్యక్త ఆకర్షణ ఉంది. డెప్త్ ఉంది. ఇంత మాట పడి కూడా ఆమె వివరాలు తెలుసుకోలేకపోయాను.

** ** **

ఆమె కనిపించిన ప్రతిసారి ఆమెనే పరిశీలిస్తూ ఉండడం అలవాటయ్యింది. ఆమె రాని రోజు వెలితిగా అనిపించేది.

చాలాసార్లు ఏదో ఒక పుస్తకం చదువుతూ కూర్చునేది. లేదా ఎవరో ఆప్తుల కోసం ఎదురుచూస్తున్నట్లు ప్లాట్‌ఫాంపై ఆత్రుతగా అటూఇటూ తిరిగేది. కాని ఆమె ఎన్నడూ ఎవరితో మాట్లాడగా చూడలేదు.

అసలు రైల్వేస్టేషన్‌లోని జనం ఆమె ముందునుండి వెళుతూ కూడా ఆమెను గమనించకుండానే వెళ్ళిపోయేవారు. ఒక్కోసారి అనుమానం వేసేది- బహుశా ఆమె నా ఒక్కడికే కనిపిస్తోందేమో అని!

** ** **

ఒకరోజు ఓ వింత దృశ్యం నన్నాకర్షించింది. ఒక్కో చేత్తో ఒక్కో పుస్తకం పట్టుకుని ఏకకాలంలో రెండింటిని చదువుతూ ఆమె కనిపించింది. తెగ ఆశ్చర్యపోయాను. ధైర్యం చేసి మెల్లగా ఆమెను సమీపించాను.

"రెండు పుస్తకాల్ని ఒకేసారి చదువుతున్నట్లున్నారే?" అంటూ జోక్ చేశాను.

కాని ఆమెనవ్వలేదు. నావైపు సీరియస్‌గా చూసింది.

"అవును. నాకు బైనరీ విజన్ ఉంది. రెండు పుస్తకాల్ని ఏకకాలంలో చదవగలను... ఒక్కో కంటితో ఒక్కో పుస్తకం!" అంది.

తమాషాకు అలా అంటుందేమో అనుకున్నాను. కాని ఎప్పటిలాగే ఆమె ముఖంలో నిజాయితీతో కూడిన గాంభీర్యం కనిపించింది. అనాదికాలం నాటి దండకారణ్యంలోని ఋషులు, రాక్షసుల ఆత్మలు నా చుట్టూ నృత్యం చేస్తున్నట్లనిపించింది. ఆ వాతావరణం భయం వేసింది.

ఎందుకో చెప్పలేనుగానీ, అకస్మాత్తుగా ఆమె పోత పోసిన మా ఊరిలా అనిపించింది. ఈ భావన రాగానే ఆమె పట్ల అవ్యాజ్యమైన ప్రేమ కలిగింది.

ఎవరీమె? నాకన్నా చిన్నదా, పెద్దదా... నా స్నేహితురాలా, బంధువా? ప్రేయసా, తల్లా?... ఇవేవి కాదు అనుకున్నాను. బహుశా అన్నీ కలిపితే ఈమేనేమో!

"ఏమిటా పుస్తకాలు?" అంటూ అడిగాను. రగు చేప ముల్లు గుండిక్కాయల దిగేసినట్లు ఏదో మాట అంటుందని... వినడానికి మానసికంగా సిద్ధమయ్యాను.

కాని నా ప్రశ్న ఆమెకు చిరాకును కలిగించలేదు. పైగా నచ్చినట్లుంది. ప్రశాంతమైన స్వరంతో జవాబిచ్చింది.

"ఈ పుస్తకాలా?... ఒకటి దాస్‌కాపిటల్... రెండోది పోతన భాగవతం!" అందామె.

వాటి పేర్లు చెపుతున్నప్పుడు ఆమె గొంతులోని తన్మయత్వాన్ని గమనించాను.

నా ఆశ్చర్యానికి అంతేలేదు. ఆమెకు బైనరీ విజన్ ఉంటే ఉండొచ్చుగాక. ఏకకాలంలో రెండు పుస్తకాల్ని చదివే సామర్థ్యంఉండనీ... కాని పొంతనలేని మార్క్స్‌ను, పోతనను ఎలా చదవగలుగుతోంది?

నా ఆశ్చర్యాల్ని, సందిగ్ధాల్ని పట్టించుకోకుండా...

"ఇవి కావాలా నీకు?... చదువుతావా?..." అంటూ అడిగింది.

నేను సమాధానం ఇవ్వకముందే నా చేతుల్లో దాస్‌కాపిటల్ పడేసి చక్కా వెళ్ళిపోయింది.

నేనూ, దాస్‌కాపిటల్ మాత్రమే మిగిలామక్కడ!

** ** **

దాస్‌కాపిటల్‌ను చదవడం ప్రారంభించాను. అందులోని పదాలు, వాక్యాలు అర్థమవుతున్నకొద్దీ, అక్షరాలు నేలజారడం ప్రారంభమయ్యాయి. కొద్దిసేపటి తరువాత అవి మనుషులుగా మొలకెత్తడం గమనించాను.

క్రమంగా ఎదిగి... ఎదిగిన మనుషులు సమూహాలు, సమూహాలుగా గది తలుపులు తెరుచుకుని జనంలో కలవడం మొదలుపెట్టారు. భయంవేసి పుస్తకాన్ని చదవడం ఆపాను.

కాని ఆమెలో ఉన్నటువంటి ఆకర్షణే ఆ పుస్తకంలోనూ ఉంది. ఆమెలోని మార్మికతే పుస్తకంలోనూ ఉంది.

పుస్తకాన్ని వాపసు చేద్దామని ఆమెకోసం వెతికాను. కనిపించలేదు. ఆమె కనిపించకుండా ఉన్న కొద్దీ నాలో ఆరాటం ఎక్కువయింది. పుస్తకాన్ని చేతిలో పట్టుకుని తిరిగే ప్రతిసారి, ఒక గొప్ప జనసమూహాన్ని వెంటేసుకుని తిరుగుతున్నట్లుగా ఊపిరాడేది కాదు.

ఎట్టకేలకు ఒకరోజు కనిపించింది. పరిగెత్తుతూ ఆమె వద్దకు వెళ్ళాను. పుస్తకాన్ని ఆమె చేతిలో పెట్టాను. ఒకసారి ఆప్యాయంగా దాన్ని నిమిరి తెరిచి చూసింది. పట్టరాని సంతోషం ఆమె కళ్ళలో కనిపించింది.

"అదీ!... నువ్విప్పుడు నాకు నచ్చావు. అక్షరాల్ని మనుష్యులుగా మార్చే ఇంద్రజాలికులంటే నాకిష్టం" అంది బిగ్గరగా నవ్వుతూ.

ఆమె నవ్వు విరగబూసిన మోదుగులా ఉంది. స్త్రీ రూపం దాల్చిన సిద్ధార్థుడి నవ్వులా సమ్మోహనంగా ఉంది.

ఆమె పుస్తకాన్ని తెరిచి, పేజీలు తిరగేసి చూపిస్తూ-

"చూడు చూడు ఖాళీపేజీలు... మానవ సమూహాలుగా మారిన పేజీలు... ఇప్పుడు వాళ్ళెక్కడెక్కడో తిరుగుతుంటారు. కన్నీళ్ళు కారుస్తారు. కలియబడతారు. అంతమవుతారు. ఎవడో ఒక కవి పుస్తకంలో అక్షరాలుగా సుషుప్తావస్థ పొందుతారు, మళ్ళీ నీలాంటి వాడు ఎవడన్నా తట్టిలేపేదాకా..." అంటూ పుస్తకాన్ని పైకెగరేసింది.

ఆకాశానికి నిచ్చెన వేయడంకోసం అర్జునుడు ప్రయోగించిన మొదటి బాణంలా పుస్తకం పైకి దూసుకెళ్ళింది. అలా పైకే చూస్తుండిపోయాను. ఎంతకూ కిందకు పడకపోయేసరికి మెడలు నొచ్చి ముందుకు చూస్తే... ఆమె లేదు!

ఆమె నన్ను ఇంద్రజాలికుడు అంది. కాని వాస్తవమేమిటంటే ఆమె నిజమైన ఇంద్రజాలికురాలు. ఆ... తెలిసింది. ఆమె మెజీషియన్ అనుకున్నాను. కాని అలా అనుకోవడం సంతృప్తి కలిగించలేదు.

వాస్తవం ఏదైతేనేం, మనకు నచ్చినట్లు వ్యాఖ్యానించుకోవడమే కదా జీవితం! ఆమె మెజీషియన్ కాదు. ఎందుకు కాదంటే అలా అనుకోవడం నాకిష్టంలేదు. మరి ఎవరామె? తెలుసుకోవలసిన విషయమే అదీ!

** ** **

ఇన్నిరోజుల పరిచయం తరువాత కూడా ఆమె ఎవరో... ఆమె పేరేమిటో... ఏదీ తెలుసుకోలేకపోయాను. కాని ఆమె నాకు అత్యంత పరిచయమున్న సన్నిహితమైన ఆప్తురాలు అనిపిస్తోంది. కాని ఎవరామె? ఆమెను గుర్తించలేనంతగా మతిమరపు నన్ను కమ్ముకొందా? ఆమెను పోల్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాను.

సాయంత్రం ఏడున్నర అయింది. భాగ్యనగర్ పాసింజర్ వచ్చింది. కొంతసేపటి దాకా ప్రయాణికుల ప్రవాహం. తరువాత నిశ్శబ్దం. ఏకాంతం. ప్లాట్‌ఫాంపైన నేనొక్కడినే మిగిలాను. ఒకవ్యక్తి సుమారు అరవైఐదు, డెబ్భై ఏళ్ళు ఉంటాయనుకుంటా, అక్కడే తచ్చాడుతున్నాడు. నా దగ్గరికి వచ్చాడు. ధోతి, ఖద్దరు బనియన్, చేతిలో కర్ర... ఏలె లక్ష్మణ్ గీసిన పల్లెటూరి మనిషిలాటి నిరాడంబరమైన ముఖం...

"చూడు బాపూ... ఇక్కడో తల్లి ఉండాలే..." అంటూ గొణిగాడు.

అది ప్రశ్న కాకపోవడంతో నేనేమి మాట్లాడలేదు.

"ఇయ్యాలగాని నీకు కనిపించిందా?" అంటూ ప్రశ్నించాడు.

"మీరెవరి గురించి అడుగుతున్నారు?" అంటూ తిరిగి ప్రశ్నించాను.

"నీకు తెలిసినామె గురించే అడుగుతున్నా. తంగెడుపూల చెట్టు లెక్క నిండుగ ఉంటది. తాటిచెట్టు తీరుగ నిటారుగా ఉంటది. గునకపూల లెక్క నవ్వుతది... అదో... గా తల్లి ఇయ్యాల కనపడ్డదా?"

అతను ఎవరి గురించి ప్రశ్నిస్తున్నాడో అర్థమయింది. పక్కన కూర్చోమన్నట్లుగా జరిగాను. కూర్చున్నాడు.

"ఆమె కనపడక చాలా రోజులవుతోంది. ఇంతకీ ఆమె మీకు ఏమవుతుంది?" అంటూ అడిగాను. ఎట్టకేలకు ఆమె రహస్యం ఏదో తెలుస్తుందని ఆశపడ్డాను.

"మట్టికి, మనిషికి ఉండాల్సిన సంబంధమే ఆమెకు, మనకు నడిమిట్ల ఉన్నది" అన్నాడతను.

అంతా కలిసి నన్ను గొప్ప సందిగ్ధంలోకి నెట్టేస్తున్నారు అనుకుంటూ విసుక్కున్నాను.

"మీరెక్కడి నుండి వచ్చారు?" అడిగాను.

"బోనగిరి" అంటూ సమాధానమిచ్చాడు.

"ఆమెకు ఏదన్నా చెప్పే ముచ్చట ఉంటే నాకు చెప్పండి. ఆమె కనిపించినంక నేను చెప్తా" అన్నాను.

అతడు గొంతు సవరించుకుని తన సంగతి చెప్పడం ప్రారంభించాడు.


"ఇప్పటికి అరవై ఏండ్ల సంది గూసులాడుతనే వున్నా. రజాకార్ల తోటి కొట్లాడిన. దొరల్ని గజ్జుమనేట్లు చేసిన. నిజాంతోటి నిల్చుండి కొట్లాడిన. ఇండియన్ మిలిట్రీ కండ్లల్ల కారం గొట్టిన. గిప్పుడు గూడ కొందరు నా పిలగాండ్లు కొట్లాడుతున్నరు.

కాని బాపూ, గప్పుడు నా అసోంటి బక్కోళ్ళ కోసం బందూకు పట్టక తప్పిందికాదు. మమ్ముల్ని పీక్కతినే బలిసిన దొరల మీదికి బందూకు ఎక్కువెట్టిన. ఒక్కడ్ని... ఒక్కడ్ని కూడా ఊర్లల్ల ఉంచకుండా ఎల్లగొట్టినం. గోసీలు సదురుకుంట గడీ గోడలు దుంకి పారిపోయిన్రు. దోచుకునేటోళ్ళను ఎల్లగొట్టుడే సిద్ధాంతం. అంతకు మించి తెల్వదు నాకు.

కాని, గిప్పుడు గూడ దోపిడీ జరుగుతాంది. అయితే దోపిడి చేసెటోడెవ్వడో కనిపిస్తలేడు. లక్ష్మణుడు, ఇంద్రజిత్తు యుద్ధంల ఇంద్రజిత్తు జేసిన మాయల మంత్రాల యుద్ధం లెక్క ఉన్నది. దోపిడి ఉంది. అది చేసేటోడెవ్వడో కంటికి కనిపించడు.

ఊరోళ్ళందరి ఉమ్మడి శత్రువు దొర ఉండె. ఆళ్ళను ఎల్లగొడితే దీపావళి జరుపుకున్నరు జనం. ఇప్పుడు కూడా శత్రు స్పర్శ తెలుస్తూనే ఉన్నది. కాని ఎటువైపు కత్తి విసరాల్నో తెలుస్తలేదు. పోలీసోళ్ళ మీదికి బందూకెత్తుతున్నాం. కాని జనం పండుగలు జేసుకుంటలేరు. ఎందుకంటే దొరల జాగాల పోలీసోళ్ళు పనికి రారు.

ఊరోళ్ళందరి ఉమ్మడి శత్రువు దొర ఉండె. ఆళ్ళను ఎల్లగొడితే దీపావళి జరుపుకున్నరు జనం. ఇప్పుడు కూడా శత్రు స్పర్శ తెలుస్తూనే ఉన్నది. కాని ఎటువైపు కత్తి విసరాల్నో తెలుస్తలేదు. పోలీసోళ్ళ మీదికి బందూకెత్తుతున్నాం. కాని జనం పండుగలు జేసుకుంటలేరు. ఎందుకంటే దొరల జాగాల పోలీసోళ్ళు పనికి రారు.



అందుకే ఆ తల్లిని అడుగుదామని వచ్చిన. కంటికి కనిపించని దుష్మన్‌తోని ఎట్లా కొట్లాడేది? అది సమఝైత లేదు నాకు..." అన్నాడా వృద్ధుడు ఆవేదనతో.

** ** **

అతనూ, అతని సమస్య అర్థమైంది నాకు. మా ఊరి దొర ప్రకాశరావు గురించి మా తాత చెప్పిన విషయాలు యాదికొచ్చినయ్. ఊరి పంటభూముల్లో బారానా మందం దొరవే! ఊరి జనంలో చాలామంది కూలీలుగానో, వెట్టిచాకిరి చేసే కట్టుబానిసలుగానో బతకాల్సి ఉండేది.

ప్రకాశరావు దొర పరమ కర్కోటకుడిగా పేరు పడ్డాడు. కోపమొస్తే, చిన్నప్పుడు తల్లి దగ్గర తాగిన పాలను కూడా కక్కేటట్లు కొట్టిస్తాడని ప్రతీతి. స్త్రీల విషయంలో కీచకుడు కూడా. ప్రకాశరావు ముందు చిన్నబోతాడు.

అట్లాంటి ప్రకాశరావు దొర ప్రజల చైతన్యం చూసి, జరుగుతున్న సంఘటనలు గమనించి భయంతో ఊరు వదిలి పారిపోయాడు. ఆ వార్త తెలిసిన మరుక్షణం ఊరోళ్ళ హృదయాల్లో విరిసిన సంతోషం. ఊరిలో జరిగిన సంబరం గురించి మా తాత మెరిసే కళ్ళతో చెప్పేవాడు.

పారిపోయిన దొర కొన్నేళ్ళకు ఎమ్మెల్యే అయ్యాడు. అతని కొడుకు పెద్ద ఇండస్ట్రియలిస్ట్. మనుమడు గ్రూప్ వన్ అధికారి.

దొర భూముల్లో ఎర్రజెండాలు పాతారు. వాటిని పంచాలనుకున్నా పంచడం జరగలేదు. ప్రకాశరావు ఎస్.సి. కార్పొరేషన్‌కు భూముల్ని అమ్మాడు. కొన్ని లక్షల రూపాయలు వచ్చాయి. ఎస్.సి. కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేదలకు భూములు పంచారు. కాని వాటిలోనూ రాజకీయాలు, కమీషన్లు, లంచాలు.

ప్రకాశరావు దొరకు వచ్చిన నష్టమేమిలేదు. భూములు పోయాయి. నగదుగా మారాయి. రాజకీయ పునాదులుగా మారాయి. పరిశ్రమల యంత్రాలుగా మారాయి. బ్యూరోక్రసీ తెల్ల అంగీల గళ్ళలుగా మారాయి. సంపద రూపం మారిందంతే!

ప్రస్తుతం ప్రజల ముందు ప్రకాశరావులాంటి ప్రత్యక్ష దోపిడీదారుడు లేడు. తక్షణ శత్రువు లేడు. ఇప్పుడు మనమీద శిలువలు మోపుతున్న, మన కష్టాలకు కారణమైన వ్యవస్థ ప్రకాశరావు కాలంలోలాగా నా ఊరిలోనే,

నా కళ్ళెదురుగానే ఉండడం లేదు. దాని ఉనికి, రాష్ట్రాలు, దేశాల సరిహద్దులు దాటి ఖండాంతరాలుగా వ్యాప్తి చెంది ఉంది.

అందుకే విప్లవకారుడు ప్రకాశరావు దొరను ఎదుర్కొన్న తీరులోనే ప్రస్తుత దోపిడీ వ్యవస్థను ఎదుర్కోలేడు. అసాధ్యం. దోపిడీ తీరు మారినప్పుడు పోరాట పంథా కూడా మారాలి. లేకపోతే నా ముందున్న ఈ వృద్ధుడిలాగా సందిగ్ధంలోకి జారిపోవాల్సి ఉంటుంది.

ఆ ముసలాయన్ని చూస్తే జాలేసింది. నిరంతర అజ్ఞాతవాసం ఎంత భయంకరమైనది! ఒక లక్ష్యం కోసం, సిద్ధాంతం కోసం శ్రమించడంలో ఆనందం ఉంటుంది. కాని తానంతవరకు రక్తం ధారపోసిన సిద్ధాంతంలో బలహీనతలుండడాన్ని గమనించడం... మన నమూనాకు సిద్ధాంతం ఆశిస్తున్న నమూనాకు మధ్య వ్యత్యాసం ఏర్పడినప్పుడు కలిగే బాధ నరకప్రాయం.

**నువ్వే చెప్పరా తండ్రీ!... అల్లూరి సీతారామరాజు గొప్పవాడే... కాని నా బిడ్డ కొమురం భీముడు ఏం తక్కువ? సీతారామరాజు పేరు తెలిసిన పిలగాండ్లకు కొమురం భీము గురించి తెలువకుండా చేసిన వాళ్ళెవరు? మన్నెం వీరునితో నా జోడేఘాట్ పోరడు సాటిరాడా?**



"ఎందుకయ్యా, చిన్నతనం నుంచే బందూకు వట్టినవ్?" అంటూ ప్రశ్నించాను.

కొద్దిసేపటి దాకా మాట్లాడలేదతను. కళ్ళు మూసుకున్నాడు. అతని మనోఫలకం మీద ఏయే దృశ్యాలు కుండపోత వర్షంలాగా, వడగళ్ళవానలాగా జారుతున్నాయో!

"శివారెడ్డి కవిత్వం చదివినవా? కరుణ గలవాడే కృపాణం ధరించగలడు అంటాడాయన!" అన్నాడు కళ్ళు తెరవకుండానే.

** ** **

ఒకవైపు పోలీస్ ఇన్‌ఫార్మర్ల హత్యలు... మరోవైపు ఎన్‌కౌంటర్లు... ఇంకోవైపు మతకలహాలు... మనం ఎవరికి టార్గెటో తెలియని విచిత్ర యుద్ధభూమిలో ఉన్నాం. వీటన్నింటితోపాటు మనమీద మెల్లగా పరుచుకుంటున్న ప్రపంచీకరణ ఆక్టోపస్ నీడ... పాము పడగ ఎంత నీడ ఇవ్వగలదో, ఎంత భద్రమైనదో అంత సురక్షితం మన జీవితాలు అనుకుంటూ రైల్వేస్టేషన్‌లోకి వెళ్ళానో లేదో అకస్మాత్తుగా ఆమె ప్రత్యక్షమైంది. ఆమె పరిస్థితి చూసి పరేషానయ్యాను. రేణుకా ఎల్లమ్మ తల్లిలాగా నిండుగా, గంభీరంగా ఉండే ఆమె, బదాబదలైన దేహంతో రక్తసిక్తమైన జాలిగొలిపేటట్లు కనిపించింది!

ఒళ్ళంతా దెబ్బలు... ఆగకుండా స్రవిస్తున్న రక్తం. ఆమెను చూడగానే హృదయం ద్రవించిపోయింది.

ఉరుకుతూ ఆమె వద్దకు వెళ్ళాను. జేబులోంచి దస్తీ తీసి రక్తస్రావాన్ని ఆపబోయాను. ఆమె వారించింది.

"వద్దు... వద్దు... నేనో రక్తనదిని. ఈ ప్రవాహం ఆగదు" అంది నిర్వేదంగా.

"ఎలా అయ్యాయి ఈ గాయాలన్నీ?" అంటూ ప్రశ్నించాను. నా గొంతులోని దుఃఖం ఆమెను కదిలించినట్లయింది. నావైపు ఆపేక్షగా చూసింది.

"ఇవ్వాళ ఓ ఇద్దరు హైస్కూలు పిల్లలు కనిపిస్తే వాళ్ళని అడిగిన- నా బిడ్డ కొమురం భీము మీకు తెలుసా అని? కాని వాళ్ళు తెలియదన్నరు..." అంటూ ఆమె వివరించబోతుంటే మధ్యలో ఆపాను.

"నువ్వు కొమురం భీము తల్లివా?" అంటూ ప్రశ్నించాను. నా ప్రశ్నకు ఆమె విసుక్కుంది.

"మధ్యలో అడ్డంరాకు బిడ్డా... సరే ఆ పిలగాండ్లకు తెలువదేమో అనుకున్నా. అనుమానం వచ్చి అక్కడికి దగ్గర్లోని హైస్కూలుకు వెళ్ళిన. పదో తరగతి రూములకు పోయి అడిగిన- మీకు నా బిడ్డ కొమురం భీము తెలుసా? అని. ఎందుకో ఈరోజు వాడి గురించి పదిమంది నోటితోటి వింటే మంచిగుండు అనుకున్న. కాని ఆ క్లాసు పిలగాండ్లకు ఎవరికీ భీము గురించి తెలువదట. ఏడుపొచ్చింది నాకు. చదువుకునే పోరగాండ్లే నా బిడ్డ కొమురం భీము గురించి నా చెవిల నాలుగు మంచి మాటలు వెయ్యకపోతే ఇంకెవరు చెప్తరు? అయినా ఆశ చావక జంగల్లల్ల ఉంటూ సర్కారును బందూకుల్తోటి, బాణాలతోటి అడవి బిడ్డల సాయంతోటి ఎదిరించినోళ్ళ పేర్లు చెప్పుమన్నా. అప్పుడు చెప్పిన్రు వాళ్ళు- అల్లూరి సీతారామరాజు పేరు!

నువ్వే చెప్పరా తండ్రీ!... అల్లూరి సీతారామరాజు గొప్పవాడే... కాని నా బిడ్డ కొమురం భీముడు ఏం తక్కువ? సీతారామరాజు పేరు తెలిసిన పిలగాండ్లకు కొమురం భీము గురించి తెలువకుండా చేసిన వాళ్ళెవరు? మన్నెం వీరునితో నా జోడేఘాట్ పోరడు సాటిరాడా?

కొమురం భీము గురించే తెలువనోళ్ళకు నా మిగతా పిల్లలు దొడ్డి కొమురయ్య, రావి నారాయణరెడ్డి... ఎవ్వరిపేర్లైనా ఎలా తెలుస్తయ్? అవున్లే బాపూ, నా టాంక్‌బండ్ గుండెలపైనే నా పోరగాండ్ల ఆనవాలు కానరానప్పుడు మీతరానికి వాళ్ళ గురించి ఏం తెలుస్తుందిలే!

మనల్ని తమ ఇనుప పాదాల కింద నలిపేసిందెవరో తెలుసా? మనం ఎవరి నుండి విముక్తి పొందామో తెలుసా అని ఆ పదో తరగతి పిలగాండ్లను అడిగిన. బ్రిటిషోళ్ళు అని చెప్పిన్రు. దొరలు తెలుసా... దేశ్‌ముఖ్‌లు తెలుసా... రజాకార్లు తెలుసా... నిజాం సర్కారు తెలుసా... అని అడిగిన. ఏదో పరాయిదేశపు పేర్లు వింటున్నట్లు నోరు తెరిచి చూస్తున్నరుగానీ, ఒక్కని కండ్లల్ల వాళ్ళ వివరం తెలిసిన జాడల్లేవు.

ఈ చదువులు గిట్లెందుకు తగలబడ్డయి బిడ్డా? వాని మట్టి గురించి వానికి తెలియకపోతే ఎట్లా?

ఈ లొల్లి అంతా వింటున్న పోలీసొకడు వచ్చి కొమురం భీము గురించి చెప్తున్నవేందే... నక్సలైట్లతోటి మిలాఖతైనవా అంటూ ఎటువడితే అటు గుద్దిండు. గవ్వే గీ దెబ్బలు!

అల్లూరి సీతారామరాజు గురించి మాట్లాడితే దేశభక్తి. కొమురం భీము గురించి నోరిప్పితే తీవ్రవాదం! తమ తల్లి గురించి తామే మాట్లాడుకోవడం నిషిద్ధమైన కాలంలో ఇక అన్నదమ్ముల గురించి ఏం మాట్లాడతారులే..." అంటూ చెప్పుకుపోతోందామె.

ఆమె మాటల్లో ఆవేశం ఉంది. ఆవేదన ఉంది.

అర్థమవుతోంది తల్లీ... నాకర్థమవుతోంది! నువ్వెవరో నీ ఆవేదన దేనికోసమో... నీ ఆగ్రహమెందుకో! వణుకుతున్న శరీరంతో, చెమర్చిన కళ్ళతో ఆమెవైపు చూశాను.

"ఇంకా ఏం పోల్చుకోవాలని చూస్తావు... నేనురా... తీగెలు తెగిన నీ కోటి రతనాల వీణను... కరువులో వచ్చిన బతుకమ్మ పండుగను... ప్రసవంలోనే బిడ్డల్ని పోగొట్టుకున్న పచ్చి బాలింత రొమ్మును..." అంది.

●

## రుద్రాక్షధారణ- ముఖ్య విశేషాలు

రుద్రాక్ష ధారణ శుభకరం. శోభకరం. రుద్రాక్ష మహత్తు దాని ముఖ సంఖ్య వల్ల నిర్ణయించబడుతుంది. 21 ముఖాల రుద్రాక్షల వరకు పురాణాల్లో చెప్పబడింది. ఏకముఖ, దశముఖ, చతుర్దశముఖ రుద్రాక్షలు బహు అరుదుగా దొరుకుతాయి. ఏకముఖ రుద్రాక్ష మహిమాన్వితమైన శక్తి కలది. దాన్ని ధరిస్తే మనస్సు, బుద్ధి, చైతన్యం వశమౌతాయి. కుండలినీ శక్తిని ఉద్దీపింపచేస్తుంది.

రెండు రుద్రాక్షలు ఒకటిగా కలిసి ఉంటే అటువంటి దానిని 'గౌరీశంకరం' అంటారు. ఇది కూడా దుర్లభమే. కొంచెం పొడవుగా ఉన్న రుద్రాక్షలో ఒకపక్క కొంచెం లావుగా ఉండే రకం కూడా 'గౌరీశంకరం' అవుతుంది.

రుద్రాక్షలను ఏ పరిస్థితుల్లోనైనా ధరించవచ్చు. శుచి, అశుచి భేదాలు దీనికి వర్తించవు. సబ్బు నురగ వల్ల చెడకుండా ఉండటానికి మాత్రం స్నానం చేసేటప్పుడు తీసి పక్కన పెట్టవచ్చు. స్నానానంతరం ధరించవచ్చు.

విరిగిన, పగిలిన రుద్రాక్షలను ధరించకూడదు. అటువంటి వాటిని నదీ ప్రవాహంలోనో, చెరువులోనో వదిలివేయాలి. సంవత్సరానికోసారి రుద్రాక్షలను తిరిగి అభిమంత్రించి ధరించాలి. నెలకి ఒకసారి నెయ్యి లేదా ఆవనూనెను రుద్రాక్షలకు పట్టిస్తే ఎక్కువకాలం మన్నుతాయి.

ప్రతి ఉదయం స్నానానంతరం రుద్రాక్షను భ్రూమధ్యంలో ఉంచి కనీసం 11 సార్లు నమశ్శివాయ మంత్రం జపించాలి. ప్రతిరోజూ రాగిపాత్రలో శుద్ధ జలం పోసి రుద్రాక్ష మాలను దానిలో ఉంచి తిప్పుతూ 108 సార్లు శివపంచాక్షరి మంత్రం జపించి ఆ తీర్థం స్వీకరిస్తే ఏ వ్యాధులూ దరిచేరవు.

రుద్రాక్షలతోపాటు పగడం, స్ఫటిక మణి అనే వాటిని మధ్యమధ్య వుంచి మాలగా తయారుచేసి ధరించవచ్చు.

బంగారం, వెండి, రాగి తీగకాని, పట్టుదారంతోగాని రుద్రాక్షలను గుచ్చి హారం తయారుచేసుకోవచ్చు.

రుద్రాక్షకు రెండు వైపులా ఉన్న రంధ్రాలను బంగారం లేదా రాగి బిళ్ళలతో కప్పి మాల తయారుచేయడం వల్ల ప్రాణశక్తి మన శరీరంలో ఎక్కువగా వ్యాపించడానికి అవకాశం వుంటుంది.

– డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి

చదవండి మీ విజ్ఞాన తృష్ణకి సరైన వేదిక చదివించండి
మహర్షి కాలజ్ఞానమ్
వేదజ్యోతిష విజ్ఞాన మాసపత్రిక
డా॥ ఆమంచి బాలసుధాకర శాస్త్రి సంపాదకత్వంలో
వేదము Vs సైన్సు - సమన్వయ వేదిక
సం॥ర చందాదారులుకండి
ఉచితజాతకం, రుద్రాక్ష పొందండి
సభ్యులను చేర్పించుటకు ఏజంట్సును ఆహ్వానిస్తున్నాము.
శ్రీమహర్షి పబ్లికేషన్స్
శ్రీ మహర్షి రుద్రాక్ష & నవరత్న ఎంపోరియం
నం.13, గాయత్రి టవర్స్, Opp : ఓల్డ్‌బస్‌స్టాండు ఎదురుగా, విజయవాడ - 0866-570199
బ్రాంచి : 6-3-354/10, హిందీనగర్, పంజాగుట్ట - హైదరాబాద్ 040-6636696